ఈనాడు
తూర్పుగోదావరి
బుధవారం 28 మార్చి 2018 .. 16 పేజీలు




# సాధనతోనే కీర్తి పతాక

ఆమె విజయం మహిళా లోకానికి గర్వకారణం. ఆ పోరాట పటిమ క్రీడాకారిణులకు స్ఫూర్తిదాయకం. అసౌకర్యాల నడుమ కఠోర సాధనతో దేశానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుతెచ్చి భారత దేశ కీర్తి పతాకాన్ని రెపరెపలాడించిన ధీర వనిత. ఒలింపిక్స్ చరిత్రలో వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో దేశానికి తొలి పతకం తెచ్చిన కరణం మల్లీశ్వరి మంగళవారం కాకినాడ జేఎన్టీయూ క్రీడా దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...

– న్యూస్‌టుడే, భానుగుడి సెంటర్ (కాకినాడ)

### అతిథితో కాసేపు...

## చాలా ఆనందంగా ఉన్నా...

క్రీడల నుంచి విరామం తీసుకున్న తర్వాత హరియాణాలో అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాను. 8 నుంచి 15 ఏళ్ల లోపు వయసుగల 37 మంది క్రీడాకారులకు అన్ని రకాలుగా తర్ఫీదునిస్తున్నాం. భవిష్యత్‌లో దేశానికి పతకాలు సాధించే క్రీడాకారులను తయారుచేస్తూ క్రీడా జీవితాన్ని ఆశ్వాదిస్తున్నాను. మీరాభాయ్‌చాను 48 కేజీల విభాగంలో అసాధారణ ప్రతిభ కనబరుస్తోంది. ఈమె నా భవిష్యత్ ఆశాకిరణం.

## కామన్‌వెల్త్‌లో పతకాలు ఖాయం

ఆస్ట్రేలియాలో జరుగుతున్న కామన్‌వెల్త్ పోటీల్లో వెయిట్ లిఫ్టింగ్‌లో మనోళ్లు అదరగొట్టటం ఖాయం. సుమారు ఆరు పతకాలు సాధించే అవకాశం ఉంది. మన క్రీడాకారులు మంచి ఫామ్‌లో ఉన్నారు. ఇదే ప్రతిభను కనబరిస్తే భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించే అవకాశం ఉంది.

## క్రీడా పాలసీ తీసుకొస్తే....

బ్యాడ్మింటన్‌లో వరుసగా పతకాలు సాధించటంతో ప్రభుత్వం ఆ క్రీడను ప్రోత్సహిస్తోంది. పతకాలు సాధించిన క్రీడాకారులకు గ్రూప్స్‌లో ఉద్యోగాలిచ్చారు. వెయిట్‌లిఫ్టింగ్ విషయానికొస్తే ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడంలో మనం వెనుకపడ్డాం. దీంతో క్రీడకు ఆదరణ తగ్గింది. భవిష్యత్‌లో పుంజుకొని దేశానికి పతకాలు తెస్తే బ్యాడ్మింటన్ క్రీడాకారుల మాదిరి వెయిట్ లిఫ్టర్లకు మంచిరోజులు వస్తాయి. రాష్ట్రంలో క్రీడా విధానాన్ని తీసుకొస్తే పతకాలు సాధించిన ప్రతి ఒక్క క్రీడాకారులకు భవిష్యత్ ఉంటుంది. ప్రతి జిల్లాలో వెయిట్ లిఫ్టింగ్ అకాడమీలు ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. అక్కడ తర్ఫీదుతోపాటు సైంటిఫిక్ (సాంకేతికం)గా శిక్షణిచ్చే ఏర్పాటు చేయాలి.

## నేడు పరిస్థితులు మారాయి...

ఏ సౌకర్యాలు లేని రోజుల్లోనే కష్టపడి పతకం సాధించాలనే తపనతో, పట్టుదలతో సాధన చేసే వాళ్లం. నేడు పరిస్థితులు మారాయి. కళాశాల్లో సీటు వస్తుందనో, ప్రభుత్వ ఉద్యోగం వస్తుందనో చెబితేనే సాధన చేస్తున్నారు. ఫలితాలు కూడా త్వరగా వచ్చేయాలన్న ధోరణితో క్రీడాకారులు, తల్లిదండ్రులు ఉన్నారు. ఈ విధానం ఎంతమాత్రం మంచిదికాదు. నేను ప్రపంచ స్థాయిలో పతకం సాధించినప్పటికీ ఆ రోజుల్లో నాకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వలేదు.

## ఆత్మహత్యలే శరణ్యం కాదు...

ఆంధ్రప్రదేశ్‌లో తల్లిదండ్రులు చదువుపై చూపిస్తున్నంత శ్రద్ధ క్రీడలపై ఉంచడం లేదు. పరీక్షల్లో ఫెయిల్ అయ్యాననో.. ప్రేమ విఫలమైందనో ఒత్తిడి తాళలేక యువత ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు ఎక్కువవుతున్నాయి. ప్రతి విషయానికి ఆత్మహత్య పరిష్కార మార్గం కాదు. ప్రతి రోజూ క్రీడలు ఆడండి. గెలుపోటములను ఏ విధంగా తీసుకోవాలో అవే నేర్పిస్తాయి. నేను క్రీడల్లో ఏ దేశంపైనైనా ఓటమిపాలైతే ఆ దేశంపై ఏవిధంగా విజయం సాధించాలో మరుసటి రోజునుంచే ఆలోచిస్తాను. క్రీడల్లోకి వచ్చినప్పట్నుంచి అసలు ఒత్తిడంటే ఏంటో తెలియదు.